# మన(సు)లో మాట

సంఘమిత్ర పాఠక మహాశయులందరికీ 'వ్యయ' నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు మరియు శ్రీరామ నవమి శుభాకాంక్షలు. గత సంచికలోని అంశాలు పలువురికి నచ్చినందులకు సంతోషం. మా ప్రయత్నానికి అడుగడుగునా చేయూతనిస్తూ, ప్రోత్సాహాన్నందిస్తున్న డాక్టర్ వేమూరి వేంకట రామనాథం గారికి, శ్రీ దూర్వాసుల వేంకట సుబ్బారావు గారికి, దేవాలయ అర్చకులు శ్రీ శ్రీనివాస్ గారికి, ఒగిరాల కృష్ణారావు గారికి, కుటుంబ సభ్యులకు, మిత్రులకు, ప్రతి సంచికను చదివి - అమూల్యమైన సలహాలను అందిస్తున్న పాఠకులకు ధన్యవాదములు. ఈ సంచికలో 'చరిత్రకెక్కిన చరితార్థులు' శీర్షికలో గత సంచిక తరువాయి భాగమైన 'విశ్వకవి వేమన' వ్యాసాన్ని అందిస్తున్నాము.

ఈ సంచికలో సందర్భోచితమైన విధముగా బొమ్మలను చిత్రించి, తనవంతు సహకారాన్ని అందించి, పేరు ముద్రించడానికి ఇష్టపడని ఓ భావి చిత్రకారుడికి సంఘమిత్ర ధన్యవాదములు తెలుపుతోంది. రానున్న సంచికలలో పొడుపు కథలకు బదులు 'మన ఆచారాలు - అంతరార్థములు' అన్న శీర్షికను ప్రవేశపెడుతున్నాము. మరపురాని అనుభూతులను తెలియజేస్తూ 'నా స్మృతి పథంలో ఒక రోజు', 'పంచతంత్ర కథలు', రామాయణము, భారతముల నుండి కొన్ని రసవత్తర ఘట్టములు త్వరలో మీకు అందించే ప్రయత్నం చేస్తున్నాం. మీరు కూడా ఈ శీర్షికలకు సరిపడే కథలను, పద్యములను, వ్యాసములను పంపవచ్చు. మీ రచనలను సంఘమిత్రలో ప్రచురణ కోసం ఆహ్వానిస్తున్నాము.

బాలమిత్ర, 'సంక్రాంతి సంబరాలు', 'విశ్వకవి వేమన' మొదలైనవి మెచ్చుకుంటూ మీరు పంపిన ఉత్తరములకు ధన్యవాదములు. ఈసారి 'చెప్పుకోండి చూద్దాం!', 'సమస్యల"తోరణం"' మరియు 'మేథమేటిక్స్' మీ సౌకర్యం కోసం English లో కూడా అందిస్తున్నాం.

ఈసారి 'పదచదరంగం', 'పొడుపు కథలు', 'సమస్యలతోరణం', 'చెప్పుకోండి చూద్దాం!' శీర్షికలకు సమాధానములు పంపిన పాఠకులకు అభినందనలు. ఈసారి సమాధానములు పంపినవారి సంఖ్య కాస్త తగ్గింది. మళ్ళీ గుర్తు చేస్తున్నాం. మీకు తెలిసినంతవరకు సమాధానములు ఇంగ్లీషులోనైనా వ్రాసి పంపించవచ్చు. మళ్ళీ జులై మాసపు సంచికలో కలుద్దాం! సెలవా మరి.

సంఘమిత్ర సంపాదక వర్గం.